పేదలకు నాణ్యమైన విద్య అందించాలి : ప్రభుత్వ విప్ బీర్ల

స్కూల్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ప్రభుత్వ విప్ ఐలయ్య

బొమ్మలరామారం, మార్చి 29 : అషిర్ మిషన్ స్కూల్ యాజమాన్యం పేదలకు నాణ్యమైన విద్య అందించాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మండలంలోని మర్యాల గ్రామంలో గల గ్రేట్ మిషన్ క్యాంపస్ ఆవరణలో నిర్మించతలపెట్టిన అషిర్ మిషన్ స్కూల్ భవనానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు, అనాథ విద్యార్థుల విద్య కోసం పాఠశాల నిర్మించడం అభినందనీయమన్నారు. పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో తాసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీఓ రాజా త్రివిక్రమ్, నాయకులు మర్రి కృష్ణారెడ్డి, గ్రేట్ మిషన్ నిర్వాహకుడు ఆశీర్వాదం పాల్గొన్నారు.

వంద రోజుల పనులను సద్వినియోగం చేసుకోవాలి

● డీఆర్‌డీఓ నాగిరెడ్డి

ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ నాగిరెడ్డి

యాదగిరిగుట్ట, మార్చి 29 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం కల్పించే వంద రోజుల పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ నాగిరెడ్డి అన్నారు. మండలంలోని చిన్నకందుకూరు గ్రామంలో శనివారం ఉపాధి హామీ పనులను పరిశీలించి మాట్లాడారు. ఉపాధి హామీ కూలీలకు రోజువారీ వేతనం రూ.240 వస్తుందని, మరో గంట పాటు పనిచేస్తే రూ.300 వరకు వచ్చే అవకాశం ఉందని అన్నారు. కూలీలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని మరో గంట పని చేస్తే బాగుంటుందని సూచించారు. వ్యవసాయ భూములుంటే ఉపాధి హామీ పథకం కింద పనులు ఉచితంగా చేయించుకోవాలన్నారు. మహిళా సంఘాలు సబ్సిడీ రుణాలను పొంది ఆర్థికంగా ఎదుగాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నవీన్‌కుమార్, ఏపీఓ నారాయణ, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

ఎల్ ఆర్ఎస్ గడువును పొడిగించాలి : శంకరయ్య

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ శంకరయ్య

ఆలేరు టౌన్, మార్చి 29 : ఎల్ఆర్ఎస్ గడువును పొడిగించాలని మున్సిపల్ మాజీ చైర్మన్ వస్పరి శంకరయ్య ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని తన కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్ఆర్ఎస్ గడువును ఏప్రిల్ 30వరకు పొడిగించి ప్రజలకు వెసులుబాటు కల్పించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్ ఆర్ఎస్ పాలసీని తీసుకొచ్చి, ప్రజలకు వెసులుబాటు కల్పిస్తే.. ఆనాడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రజల సొమ్మును ఎల్ఆర్ఎస్ పేరు చెప్పి లూటీ చేస్తున్నారని ఆరోపించారన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం 25శాతం ఆశ చూపి ప్రజల ముక్కు పిండి ఎల్ఆర్ఎస్ ఫీజు వసూలు చేస్తుందని విమర్శించారు. షాదీఖాన సమీపంలో ముస్లిం మైనార్టీ కమిటీ హాల్ కోసం గతంలో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత శంకుస్థాపన చేస్తే.. ప్రస్తుత ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మళ్లీ శంకుస్థాపన చేయడమేంటని ప్రశ్నించారు. ఆలేరు అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే సునీత రూ.18 కోట్లు ప్రత్యేక నిధులు తీసుకోస్తే.. ఎన్నికల కోడ్‌తో పనులు జరుగలేదన్నారు. వర్క్ ప్రొసీడింగ్ జరిగిన కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించకుండా ఎమ్మెల్యే ఐలయ్య కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసే అరాచకాలను, మోసాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఆ ప్రభుత్వానికి త్వరలోనే ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఆలేరులో తాగునీరు లేక, మిషన్ భగీరథ నీళ్లు రాక ప్రజలు కష్టాలు పడుతుంటే ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు జల్లి నర్సింహులు, ఎగ్గిడి సిద్ధులు పాల్గొన్నారు.

'ప్రజా వ్యతిరేక విధానాలపై యువత ఉద్యమించాలి'

సమావేశంలో మాట్లాడుతున్న పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి బెజాడి కుమార్

భూదాన్ పోచంపల్లి, మార్చి 29 : పాలకులు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై యువత ఉద్యమించాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్ జనార్దన్, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి బెజాడి కుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం భగత్‌సింగ్ 94వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భగత్‌సింగ్ ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని పెంచి పోషిస్తుందని, మతం పేరుతో ప్రజలను విభజించి హింసా వాతావరణం సృష్టిస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. యువ వికాస పథకం లోపభూయిష్టంగా ఉందని, పథకానికి రేషన్ కార్డు కావాలని షరతులు పెడుతున్నారని తెలిపారు. అర్హులందరికీ ఈ పథకం వర్తింపజేయాలని, గడువు తేదీని పెంచాలని డిమాండ్ చేశారు. పీవైఎల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మారుజోడు సిద్ధేశ్వర్, సాదుల శ్రీకాంత్, జిల్లా కోశాధికారి పగడాల శివ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మామిడాల ప్రవీణ్, నాయకులు నర్సింహ, ముత్యాలు, బాలకృష్ణ, వెంకటేశ్, కృష్ణ, కుమారస్వామి, శ్రీనివాస్, బీరయ్య, నాగరాజు, బాలరాజు, ఉదయ్ పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి : సీపీఎం

మైనింగ్ అధికారికి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

బీబీనగర్, మార్చి 29 : మండలంలోని రాయరావుపేట గ్రామంలో 30, 31 సర్వే నెంబర్లలో గల 24ఎకరాల అసైన్డ్ భూమిలో మట్టి తవ్వకాలను ఆపాలని, అక్రమంగా మట్టి తీసుకెళ్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోమటి రెడ్డి చంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా మైనింగ్ ఏడీ ఆఫీసులో టెక్నికల్ అసిస్టెంట్ లావణ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ 40-50 సంవత్సరాల క్రితం ఆరుగురు గొర్ల కాపరులకు ఒక్కొక్కరికి నాలుగెకరాల చొప్పున జీవాలు మేపుకోవడానికి అప్పటి ప్రభుత్వం అసైన్డ్ పట్టాలు ఇచ్చిందన్నారు. వారు గొర్లు మేపుకోకుండా మట్టిని అమ్ముకుంటున్నారని తెలిపారు. ఈ విషయంపై చాలాసార్లు రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. మైనింగ్ అధికారులు స్పందించి మట్టి తవ్వకాలకు పాల్పడుతున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే సీపీఎం ఆధ్వర్యంలో మట్టి తవ్వకాలను అడ్డుకుంటామని, అప్పుడు జరిగే పరిణామాలకు జిల్లా యంత్రాంగం బాధ్యత వహించాలని అన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీపీఎం మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్, మోటకొండూరు మండల కార్యదర్శి కొల్లూరి ఆంజనేయులు ఉన్నారు.

తాసీల్దార్ల అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ

తాసీల్దార్ల అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ సభ్యులు

భువనగిరి అర్బన్, మార్చి 29 : తెలంగాణ తాసీల్దార్ల అసోసియేషన్ జిల్లా కమిటీ సమావేశం శనివారం పట్టణంలోని ఓ హోటల్లో నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి.లచ్చిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తాసీల్దార్ల అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా పొదిల రవికుమార్, సెక్రటరీలుగా పల్లవి, శ్రీనివాస్‌రెడ్డి, ట్రెజరర్‌గా హరికృష్ణ ఎన్నికయ్యారు.

విశ్వావసు నామ సంవత్సర పంచాంగం ఆవిష్కరణ

పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, మార్చి 29 : మండలంలోని వడాయిగూడెం సమీపంలోని వాసవి నిత్యన్నదాన సత్రంలో ధూప, దీప, నైవేద్య అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు చలివేదుల రాజేశ్వర్‌శర్మ, ప్రధాన కార్యదర్శి చందోజు శివకుమారాచార్యులు ఆధ్వర్యంలో విశ్వావసు నామ సంవత్సర పంచాంగాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అర్చక సంఘం రాష్ట్ర కన్వీనర్ హరికీర్తి అమరేశ్వరశర్మ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విశ్వావసు నామ సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పాడి పంటలు అభివృద్ధి చెంది అన్ని విధాలుగా మంచి జరుగాలని ఆకాంక్షించారు. ఈ సంవత్సరం ప్రజల్లో ప్రేమాభిమానాలు పెరిగి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉంటారని చెప్పారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ హనుమంతరావు చేతుల మీదుగా నూతన పంచాంగాన్ని ఆవిష్కరింపజేశారు. సంఘం రాష్ట్ర ప్రతినిధులు విశాలాక్షి, జిల్లా కోశాధికారి నిమ్మల అమలేశ్వర్, సహాయ కార్యదర్శి తిరుమల కిశోర్, వివిధ మండలాల అధ్యక్షులు మణికంఠశర్మ, వేణుగోపాలచార్యులు, ఆదిత్యశర్మ, అర్చకులు పాల్గొన్నారు.

భువనగిరి తైబజార్ వేలం పాట

భువనగిరి అర్బన్, మార్చి 29 : మున్సిపాలిటీలో 2025-26 సంవత్సరానికి తైబజార్ వసూలు చేయుటకు మున్సిపల్ కార్యాలయంలో శనివారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో పట్టణానికి చెందిన యాట రాజు, నిలిగొండ శివశంకర్, నర్సింగ్, సురేశ్‌కుమార్ పాల్గొన్నారు. తైబజార్ వేలం పాటను నిలిగొండ శివశంకర్ 9,00,500 రూపాయలకు దక్కించుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ జి.రామలింగం తెలిపారు.

త్రిశక్తి ఆలయంలో చోరీ

వలిగొండ, మార్చి 29 : మండల కేంద్రంలోని త్రిశక్తి ఆలయంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం తెల్లవారుజామున 3గంటల సమయంలో త్రిశక్తి ఆలయంలోకి దుండగులు చొరబడి సుమారు కిలో వెండి, 5 గ్రాముల బంగారం, 20వేల నగదు దొంగిలించారు. గుడి తలుపులు తెరచి ఉండటాన్ని ఆలయ నిర్వాహకులు తెల్లవారుజామున 4గంటల సమయంలో గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి ఆలయంలో, పరిసరాలను పరిశీలించారు. ఆలయ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

పన్నుల చెల్లింపు కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు

మోత్కూరు, మార్చి 29 : ఉగాది, రంజాన్ పండుగ సెలవు దినాల్లోనూ పన్నుల చెల్లింపు కోసం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ కె.సతీశ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆది, సోమవారం మున్సిపల్ ఆస్తి పన్నులు, నల్లా బిల్లులు, ఎల్ఆర్ఎస్ చెల్లింపునకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు మోత్కూరులో ఉగాది బోనం

మోత్కూరు, మార్చి 29 : తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను ఆదివారం మోత్కూరు పట్టణ ప్రజలు వినూత్నంగా జరుపుకోనున్నారు. ఉగాది సందర్భంగా ముత్యాలమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించడం ఇక్కడి ప్రత్యేకత. రైతులు పశువులను, ఎడ్ల బండ్లను శుభ్రం చేసుకొని అలంకరించి పూజిస్తారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చెరువు కట్ట వద్ద ఉన్న ముత్యాలమ్మ ఆలయాలు, సుందరయ్య కాలనీలోని ఇందిరపల్లి ముత్యాలమ్మ, కొండాపురంలోని ముత్యాలమ్మ దేవాలయాల చుట్టూ బోనాలతోపాటు ఎడ్లబండ్ల ప్రదక్షిణ నిర్వహిస్తారు. అమ్మవారికి కోళ్లు, మేకలను బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. బెల్లం, పెరుగు, పాలు, నిమ్మ పానకాలతో తెలుగు సంవత్సరం వేడుకలకు ఘన స్వాగతం పలుకుతారు. సాయంత్రం రామలింగేశ్వరస్వామి ఆలయంలో పురోహితులు పంచాంగ శ్రవణం చేస్తారు.

'నామినేటెడ్ పదవుల్లో దివ్యాంగులకు ప్రాధాన్యమివ్వాలి'

భువనగిరి కలెక్టరేట్, మార్చి 29 : యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో ఏర్పాటు చేయనున్న ట్రస్ట్ బోర్డులో దివ్యాంగులకు అవకాశం కల్పించాలని వికలాంగుల సంఘం జిల్లా నాయకుడు సుదగాని రాజుగౌడ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం దివ్యాంగులకు రాజకీయపరంగా అవకాశాలు కల్పించి ఆదరించాలని పేర్కొన్నారు. ట్రస్టు బోర్డులో దివ్యాంగులకు అవకాశం కల్పిస్తే అన్ని విధాలా న్యాయం జరుగుతుందని తెలిపారు.

బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలి

మోత్కూరు, మార్చి 29 : బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని మండలంలోని పాలడుగు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.కమలాకర్‌రెడ్డి కోరారు. పాఠశాలలో శనివారం 75 సంవత్సరాల వజ్రోత్సవ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1950లో గ్రామంలో పాఠశాలను ఏర్పాటు చేశారన్నారు. పాఠశాలలో చదువుకున్న అనేక మంది ఉన్నత స్థానాలకు ఎదిగారని మాజీ సర్పంచ్ మరిపెల్లి యాదయ్య అన్నారు. పాఠశాల బలోపేతానికి దాతలు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు బద్దం యాదగిరి రెడ్డి, ఏఏపీసీ చైర్మన్ పబ్బు అరుణ, మాజీ ఎంపీటీసీ అంతటి నర్సయ్య పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

భువనగిరి కలెక్టరేట్, మార్చి 29 : మండలంలోని ఆకుతోటబావితండాకు చెందిన కేతావత్ రాకేశ్ ఇటీవల అగ్ని ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. కాండ్లకుంటతండాకు చెందిన గుగులోతు ఉపేందర్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. వారి కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పచ్చిమట్ల శివరాజ్‌గౌడ్ శనివారం రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. గ్రామస్తులు ఉమ్లానాయక్, తిరుపతినాయక్, లచ్చిరాంనాయక్, హనుమా, నర్సింహ, రామచందర్, బిచ్యా, వెంకటయ్య పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న శివరాజ్‌గౌడ్

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

మహాధర్నాలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

చౌటుప్పల్, మార్చి 29 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. సీపీఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా శనివారం చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ శేఖర్‌రెడ్డికి వివిధ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, చౌటుప్పల్‌ను కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని అన్నారు. అర్హులైన పేదలకు రేషన్ కార్డులు, ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులందరికీ రూ.2లక్షల రుణ మాఫీ చేయాలని, పట్టణంలో వంద పడకల దవాఖానను త్వరగా పూర్తిచేయాలని అన్నారు. మండలానికి కృష్ణా, గోదావరి జలాలు అందించాలని, పిలాయిపల్లి కాల్వ ద్వారా స్థానిక చెరువులను నింపాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి కనీస మద్దతు ధర కల్పించాలన్నారు. గ్రామ కంఠం, ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు. పరిశ్రమల్లో స్థానిక యువతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బూర్గు కృష్ణారెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ పాషా, మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్, నాయకులు రాగీరు కిష్టయ్య, చీరిక సంజీవరెడ్డి, తడక మోహన్, చింతల సుదర్శన్, బోయ యాదయ్య, శ్రీశైలం, శ్రీను, మధుకృష్ణ, వెంకటేశ్, నందీశ్వర్ పాల్గొన్నారు.

వృత్తిదారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

● చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఆశయ్య

సమావేశంలో మాట్లాడుతున్న చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఆశయ్య

భువనగిరి అర్బన్, మార్చి 29 : అసెంబ్లీ ఎన్నికల ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో చేతి వృత్తిదారులకు పొందుపరిచిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ పైళ్ల ఆశయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని దుంపల మల్లారెడ్డి ట్రస్ట్ భవనంలో చేతి వృత్తిదారుల సమన్వయ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి రూ.11,405 కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. ప్రతి సంవత్సరం రూ.20వేల కోట్లు కేటాయిస్తామని చెప్పిన ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని విమర్శించారు. బీసీ బడ్జెట్‌ను సవరించి రూ.25వేల కోట్లకు పెంచాలని, బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ, ఎంబీసీ కార్పొరేషన్లకు దరఖాస్తు చేసిన వారందరికి రూ.10 లక్షల వరకు వ్యక్తిగత రుణాలు అందించాలన్నారు. వివిధ సొసైటీలకు రూ.30లక్షల వరకు రుణాలు అందించాలని, గీత, చేనేత కార్మికులకు, ఇతర వృత్తిదారులకు పింఛన్ పెంచాలని కోరారు. గీత కార్మికుల సొసైటీకి 5 ఎకరాల స్థలం ఇవ్వాలని, రెండో విడుత గొర్రెల పంపిణీ చేయాలని, చేనేత, రజక, క్షౌర, మత్స్యకారులకు, సంచార జాతుల సంక్షేమానికి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమించాలని వృత్తిదారులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చేతి వృత్తిదారుల సంఘం జిల్లా మాజీ కన్వీనర్ మాటూరి బాలరాజు, గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దయ్యాల నర్సింహ, మద్దెపురం రాజు, రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డెబోయిన వెంకటేశ్, క్షౌర వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాదం విష్ణు, ఆయా సంఘాల నాయకులు మల్లేశం, సత్యనారాయణ, మైసయ్య, జహంగీర్, భాస్కర్, నర్సింహ పాల్గొన్నారు.

మున్సిపాలిటీలోని సమస్యలు పరిష్కరించాలి : సీపీఎం

మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

భువనగిరి అర్బన్, మార్చి 29 : మున్సిపాలిటీలోని ప్రజల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనూరాధ అన్నారు. సీపీఎం పోరుబాటలో భాగంగా పట్టణంలో గుర్తించిన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ జి.రామలింగంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధీలైట్ల సమస్యలు ఉన్నాయన్నారు. ఇందిరమ్మ కాలనీలో నాలుగు సంవత్సరాల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంక్ నిరుపయోగంగా ఉందని తెలిపారు. ట్యాంకులో నీళ్లు నింపి నల్లాల ద్వారా కాలనీ ప్రజలకు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అర్బన్ కాలనీలో అండర్ డ్రైనేజీతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. సింగన్నగూడెం, ఎల్‌బీనగర్, రాంనగర్, తారకరామనగర్‌లో అండర్ డ్రైనేజీ, రోడ్లు వేయాలని, పనులు పూర్తయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్, అంబేద్కర్ భవనాన్ని ప్రారంభించాలని కోరారు. సింగన్నగూడెం వద్ద అండర్‌పాస్ బ్రిడ్జి పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. ఇంటి పన్ను, నల్లా బిల్లులపై అపరాధ వడ్డీలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ, సభ్యులు కల్లూరి నాగమణి, అంజయ్య, గిరి, రాణి, రియాజ్, హరీశ్, జావేద్, నరేశ్, మంగ, లక్ష్మీబాయి, నవనీత, లత పాల్గొన్నారు.

'3న దొడ్డి కొమురయ్య జయంతి నిర్వహించాలి'

సమావేశంలో మాట్లాడుతున్న కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహ

భువనగిరి అర్బన్, మార్చి 29 : తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 98వ జయంతిని ఏప్రిల్ 3న గ్రామ, మండల కేంద్రాల్లో ఘనంగా నిర్వహించాలని కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు గవ్వల నర్సింహ అన్నారు. కలెక్టరేట్‌లో అధికారికంగా నిర్వహించే కార్యక్రమానికి కురుమలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన కురుమ సంఘం జిల్లా కమిటీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో కురుమ సంఘం సభ్యత్వ నమోదు చేపడుతామన్నారు. సంఘం మండల, గ్రామ నూతన కమిటీలను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య, కురుమ సంఘం జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు జాన సత్యనారాయణ, సభ్యులు డొకే బాలకృష్ణ, పేరపు రాములు, కాదూరి అచ్చయ్య, చిన్నం బాలరాజు, సోము రమేశ్, మోటె బుచ్చయ్య, ఎగ్గిడి శ్రీశైలం పాల్గొన్నారు.

అచ్చయ్య మృతికి మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల నివాళి

మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల

చౌటుప్పల్, మార్చి 29 : మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గంధసిరి అచ్చయ్య అనారోగ్యంతో మృతిచెందారు. శనివారం ఆయన మృతదేహంపై మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అచ్చయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. నివాళి అర్పించిన వారిలో పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ ముటుకుల్లోజు దయాకరాచారి, నాయకులు బొమ్మిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొయ్యడ శేఖర్‌గౌడ్, కృష్ణా యాదవ్, ముత్యాలు, వీరేశం, అస్లాం ఉన్నారు.

చట్టాలపై అవగాహనతోనే దళితుల్లో చైతన్యం

● ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ జిల్లా కమిటీ సభ్యుడు తిరుమలేశ్

మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ జిల్లా కమిటీ సభ్యుడు తిరుమలేశ్

మోత్కూరు, మార్చి 29 : చట్టాలపై అవగాహనతోనే దళితుల్లో చైతన్యం పెరుగనుందని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ జిల్లా కమిటీ సభ్యుడు దాసరి తిరుమలేశ్ అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ నగర్ కాలనీలో మండల అధికారులు శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇప్పటికీ దళితులపై దాడులు పెరుగుతూనే ఉన్నాయన్నారు. కుల వివక్ష కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దళితులపై దాడుల నియంత్రణ కోసం అధికారులు ప్రతి గ్రామంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసీల్దార్ ఉపేందర్, ఎస్ఐ డి.నాగరాజు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హేమంత్‌కుమ